క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు పరామర్శ

లింగాల: వివిధ అనారోగ్య కారణాలతో మృతి చెందిన కుటుంబాలను గురువారం యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్, పలువురు నాయకులు పరామర్శించారు. మండల పరిధిలోని డీసీ తండాకు చెందిన జర్పుల దేవమ్మను పరామర్శించిన శ్రీనివాస్‌రాథోడ్ మృతురాలి కులుంబానికి రూ.3 వేల ఆర్థికసాయంతో పాటు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. అదే విధంగా సూరాపూర్‌కి చెందిన ఆనందమ్మ మృతిచెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. మృతుల కటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

బీఎస్పీ నాయకుల నివాళి

తెలకపల్లి: మండల పరిధిలోని పెద్దపల్లికి చెందిన బీఎస్పీ నాయకుడు జంగం జగతి గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి కుమార్ పెద్దపల్లిలోని జగపతి మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పెద్దకొత్తపల్లి: ముష్టిపల్లికి చెందిన మహ్మద్ చోటమియా అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబం బాలపీరుకు కాంగ్రెస్ నాయకులు జగదీశ్వర్‌రావు రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగమ్మ కుర్మయ్య, ఎంపీటీసీ తలారి ఖాజ, వార్డు సభ్యులు రమేష్, గోపి, శ్రీను, మహేష్, మల్లేష్ పాల్గొన్నారు.

పలకలు పంపిణీ



లింగాల: మండల పరిధిలోని కోమటికుంటకి చెందిన ప్రసాద్ అనే దాత తన కుమారుడు కియాన్స్ జన్మదినం సందర్భంగా గురువారం విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటో తరగతి చదువుచున్న విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు పలకలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంజిలాల్, ఉపాధ్యాయులు విజయ్, అంగన్‌వాడీ టీచర్ సువర్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వాముల పడిపూజ



తెలకపల్లి: మండల కేంద్రంలో గురువారం వాసవీక్యకాపరమేశ్వరీ దేవాలయంలో అయ్యప్పస్వాముల పడిపూజా కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు పడిపూజతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదం అన్నదాన కార్యక్రమాలు చేశారు. అనంతరం శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమంతో భక్తులు శబరికి బయలుదేరారు. కార్యక్రమంలో గురుస్వాములు రాజిల్, తిరుమలేష్, రామచంద్రయ్య మరో 14 మంది స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

ఉప్పునుంతల: ఉప్పునుంతల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో మండలంలో ఉప్పునుంతల, మొల్గర, వెల్టూరు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని పీఏసీఎస్ సీఈఓ రవీందర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పునుంతల వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉప్పునుంతలతో పాటు కాంసానిపల్లి, తిర్మలాపూర్, తాడూరు, ఉప్పరిపల్లి, మర్రిపల్లి గ్రామాలకు చెందిన రైతులు ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. అదే విధంగా మొల్గర కొనుగోలు కేంద్రంలో మొల్గర, లక్ష్మాపూర్, మామిళ్లపల్లి, పెద్దాపూర్, దాసర్లపల్లి, జప్తీ సదగోడు, రాజనగర్‌కు చెందిన రైతులు, వెల్టూరు కేంద్రంలో వెల్టూరు, కొరటికల్, లత్తీపూర్, విష్ణుపూర్, పెనిమిళ్ల, రాయిచెడ్, పిరట్వానిపల్లి, అయ్యవారిపల్లి గ్రామాలకు చెందిన రైతులు ధాన్యాన్ని విక్రయించాలన్నారు. తేమ 14 శాతం కంటే మించకుండా ఉండేలా నాణ్యతతో కూడిన ధాన్యం తీసుకొచ్చి క్వింటాల్‌కు రూ.2,203ల ప్రభుత్వం కల్పించిన గిట్టుబాటు ధర పొందాలని సీఈఓ సూచించారు. రైతులు సంబంధిత ఏఈఓ వద్ద టోకెన్ తీసుకొని రావాలన్నారు.

నల్లబెల్లం పట్టివేత

అచ్చంపేట రూరల్: నిషేధిత నల్లబెల్లాన్ని అక్రమంగా సరఫరా చేస్తుండగా ఎక్సైజ్ పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... హైదరాబాద్ నుంచి అచ్చంపేటకు ఓ డీసీఎంలో 200 బస్తాలు నల్లబెల్లం సరఫరా చేస్తుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు ఆ వాహనాన్ని వెంబడించి పట్టుకున్నారు. నిందితులు వాహనాన్ని వదిలిపెట్టి వెళ్లారని పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి శుక్రవారం ఉదయం వివరాలు వెల్లడిస్తామని ఎక్సైజ్ ఎస్‌ఐ బాలరాజు తెలియజేశారు.

పక్కా ప్రణాళిక ఏదీ?



అచ్చంపేట పట్టణంలోని సాయినగర్ కాలనీలో ఇళ్ల మధ్యలో పేరుకుపోయిన మురుగు

- పట్టణ వాసులకు దోమకాటు
- లోపిస్తున్న పారిశుద్ధ్యం
- జ్వరాల బారిన పడుతున్న ప్రజలు



అచ్చంపేట పట్టణంలోని సాయినగర్ కాలనీలోని ప్రధాన రహదారి దుస్థితి

అచ్చంపేట రూరల్: గతేడాది వర్షా కాలంలో డెంగీ, వైరల్ ఫీవర్ బారిన పడి పట్టణవాసులు అల్లాడిపోతున్నారు. అధిక సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. ప్రతి సంవత్సరం వానాకాలంలో సమస్య ఉంటున్నా.. రెండు, మూడు సంవత్సరాల నుంచి సమస్య తీవ్రరూపం దాల్చింది. దోమల పిచికారి మందు సరిగా చేయలేదనే ఉద్దేశంతో మున్సిపల్ అధికారులు పక్కాప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం మళ్లీ సీజన్ రావడంతో సిబ్బంది ఇప్పుడిప్పుడే కాలనీలకు చేరుకుంటున్నారు.

పారిశుద్ధ్యంపై శ్రద్ధ ఏదీ?

అచ్చంపేట పట్టణం దినదినాభివృద్ధి చెందుతుంది. మేజర్ గ్రామ పంచాయతీ నుంచి నగరపంచాయతీ, మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యింది. మున్సిపాలిటీ అధికారులు పారిశుద్ధ్య పనులపై శ్రద్ధ పెట్టడం లేదు. పట్టణంలోని అన్ని కాలనీల్లో మురుగు కాల్వల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. చెబితే కానీ అధికారులు స్పందించడం లేదు. అధికారుల పనితీరుతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.లక్షల నిధులు మంజూరవుతున్నా.. అవసరం ఉన్న చోట డ్రెయినేజీలు నిర్మించడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. చాలా చోట్ల రోడ్లపైనే మురుగు పారుతుంది. దీనికి తోడు కాలనీలోని ఖాళీ స్థలంలో, ఇళ్ల సమీపంలో ముళ్ల చెట్లు ఏపుగా పెరిగాయి. పందులకు నివాసాలుగా ఏర్పడ్డాయి. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి.

దోమకాటు..

మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులు ఉన్నాయి. డ్రెయినేజీలు అధ్వానంగా మారాయి. డ్రెయినేజీలు చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లతో నిండాయి. వర్షాకాలంలో వర్షపు నీరు డ్రెయినేజీల్లో వెళ్లడంలేదు. కాలనీలోని ఖాళీ స్థలంలో నిల్వ ఉంటుంది. కాలనీల్లో దోమలు పెరిగిపోయి పట్టణవాసులు దోమకాటుకు గురై జ్వరాల బారిన పడుతున్నారు.

చర్యలేవీ..

మున్సిపల్ అధికారులు చెత్తరహిత ప్రాంతం, పట్టణం, స్వచ్ఛభారత్, స్వచ్ఛ మున్సిపాలిటీ పేరిట అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఆచరణ కన్పించడం లేదు. ప్రస్తుతం నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వాలను, దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయాల్సి అవసరం ఉన్నా.. నేటికీ చేపట్టడం లేదు. మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపడుతూ, ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని పట్టణప్రజలు కోరుతున్నారు.

దోమల లార్వాను అరికడతాం..



పట్టణంలోని అన్ని కాలనీల్లో విడతల వారీగా డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తున్నాం. చెత్తాచెదారం తొలగిస్తున్నాం. ప్రస్తుత వర్షాకాలంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతాం. ప్రజల ఆరోగ్యాలను కాపాడుతాం. ప్రజలు డ్రెయినేజీలు చెత్త వేయకుండా ఉండాలి. ఇంటి వద్దకు వచ్చే రిక్షాలలో మాత్రమే చెత్తను వేయాలి.

– శ్రీహరిరాజు, మున్సిపల్ కమిషనర్, అచ్చంపేట

దోమల బెడద..



పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ దేవాలయం సమీపంలోని ఇళ్లలో దోమలు విపరీతంగా పెరిగాయి. దోమకాటుకు గురవుతున్నాం. డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. కాలనీల్లో ఫాగింగ్ చేయాలి. డ్రెయినేజీల మురుగు రోడ్లపైకి రాకుండా చూడాలి.

– రజిత, కన్యకాపరమేశ్వరీ రోడ్డు, అచ్చంపేట

భార్యాభర్తల మధ్య సఖ్యత అవసరం



లింగాలలో మానవహారంలో పాల్గొన్న కొత్త జంటలు

లింగాల: భార్యాభర్తల మధ్య ఎలాంటి గొడవలు లేకుండా సఖ్యతో ఉన్నప్పుడే కుటుంబాలు బాగు పడుతాయని ఏఎస్‌ఐ శ్రీనివాసులు అన్నారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో 'అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినం' సందర్భంగా కొత్తగా వివాహమైన జంటలకు కుటుంబాల్లో కలతలు రాకుండా ఏ రకంగా మెలగాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మాట్లాడారు. అవగాహన లోపంతో చిన్న గొడవలకు పోలీస్‌స్టేషన్‌కు రావడం, ఈ మధ్య కాలంలో భార్యాభర్తలు ఇద్దరు మద్యానికి బానిసలు అయి గొడవలు సృష్టించుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్టేషన్‌కు వచ్చే కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చి మార్పు తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. పిల్లల ఎదుటనే భార్యాభర్తలు ఘర్షణకు పాల్పడటంతో ఆ ప్రభావం పిల్లలపై పడుతున్న విషయాన్ని దంపతులు గుర్తుంచుకోవాలని సూచించారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కుటుంబాలను పోషించుకోవాలని కోరారు. చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలని కోరారు. అంతకుముందు పాత బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. లింగాల, బల్మూర్ మండలాలకు చెందిన 80 జంటలు ఇందులో పాల్గొన్నట్లు నిర్వాహకులు ఆర్డీటీ ఏరియా టీం లీడర్ రాధ తెలిపారు. ఈ సందర్భంగా జంటలకు క్రీడా పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బ్యాగ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్, ఎల్టీ బుచ్చయ్య, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.



లింగాలలో క్రీడలో విజేత జంటలకు బహుమతి అందజేస్తున్న ఏఎస్‌ఐ శ్రీనివాసులు

ప్రమాదకరంగా తహసీల్దార్ కార్యాలయం



తహసిల్దార్ కార్యాలయం పైకప్పు ఇలా..

తెలకపల్లి: తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. కార్యాలయంలోని ఓ గది పైకప్పు పూర్తిగా పెచ్చులూడి పడిపోయింది. ఆ గదిలో అధికారులు, ప్రజలు ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆ గదితో పాటు మిగతా గదులు కూడా ప్రమాదభరితంగా ఉన్నాయి. అధికారులు, కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నూతన కార్యాలయాన్ని నిర్మించాలని అధికారులు కోరుతున్నారు.

సస్యరక్షణ చేపడితే కందిలో దిగుబడులు

ఉప్పునుంతల: వానాకాలం సాగుచేసిన కంది పంట ప్రస్తుతం పూత, కాయలు పట్టే దశలో ఉన్నందున రైతులు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో సస్యరక్షణ చేపడితే మంచి దిగుబడులు వస్తాయని ఉప్పునుంతల మండల వ్యవసాయాధికారి సునీత సూచించారు. కందిపంట సస్యరక్షణపై ఏఓ రైతులకు కొన్ని సూచనలు చేశారు. రైతులు వానాకాలం పంటగా.. అధికంగా పంటల్లో అంతరపంటగా కందిని సాగుచేశారు. కొంత మంది రైతులు విడిగా కూడా కందిని సాగుచేశారన్నారు. ఈ ఏడాది అనుకూలమైన వర్షాలు పడటంతో కంది పంట మాత్రం ఆశాజనకంగా ఉందని తెలియజేశారు. మండలంలో రైతులు అంతరపంటగా 1,600 ఎకరాల్లో సాగు చేశారన్నారు. ఇతర పంటలపై పెడుతున్న శ్రద్ధ రైతులు కందిపంటపై పెట్టకపోవడంతో దిగుబడులు పూర్తిగా తగ్గిపోతున్నాయన్నారు. రైతులు కంది పంటను సాగుచేసినా తగు సస్యరక్షణ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పురుగు ఆశించినా మందులు పిచికారీ చేయడంలేదని, దీంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందన్నారు. పంట పూర్తిగా చేతికొచ్చే వరకు సకాలంలో ఒకటి, రెండు పర్యాయాలు మందుల పిచికారీ చేస్తే ఆశించిన దిగుబడి వస్తుందన్నారు. ప్రస్తుతం పూత, కాయలు పట్టే దశలో ఉన్న కంది పంటకు మారుకమచ్చల పురుగు, శనగపచ్చ పురుగు, రసంపీల్చు పురుగు ఆశించినట్లు తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులు శ్రద్ధ తీసుకొని సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకుంటే ఆశించిన దిగుబడులు వస్తాయని సూచించారు.

కంది పంటలో సస్యరక్షణ..

కంది పంటకు ఆశించిన మారుకమచ్చల పురుగు, శనగపచ్చ పురుగు నివారణ కోసం స్పైనోశాడ్ 60 మిల్లీలీటర్లు లేదా క్లోరాంట్రినిలిప్రోల్ 60 మి.లీ, లేదా ఇమామెక్టిమ్ బెంజోయేట్ 80 గ్రాములు తగినంత నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా రసంపీల్చే పురుగు నివారణ కోసం డైమిథోయేట్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. కంది పంటకు గిట్టుబాటు ధరలు ఉండటంతో రైతులు పంటపై కొంత శ్రద్ధ చూపితే మంచి దిగుబడి వస్తుందని వివరించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 7288894375 చేయవచ్చన్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



పెద్దకొత్తపల్లి: దేవల్‌తిరుమలాపూర్‌లో రైతులు వానాకాలం వరిధాన్యం కోసం రోడ్లపై ఆరబెట్టారు. కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. పది రోజుల కిందట నుంచి రైతులు వరిధాన్యాన్ని కోసి రోడ్లపై ఆరబెడుతున్నారు. అధికారులు కొనుగోలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి, కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

నోట్‌పుస్తకాలు అందజేత



కొల్లాపూర్: పట్టణంలోని ముదిరాజ్ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన ఉచిత స్టడీసెంటర్ విద్యార్థులకు ముదిరాజ్ సేవాదళ్ నిర్వాహకులు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. సేవాదళ్ నిర్వాహకులు మొగలోతు దుర్గాప్రసాద్, కస్తూరి శ్రీనివాస్, తూర్పు నారాయణ విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

మొక్కులు తీర్చుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు

వంగూరు: రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యేగా డాక్టర్ వంశీకృష్ణ ఎన్నికైన సందర్భంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మొక్కులు తీర్చుకున్నారు. మండల కేంద్రంలోని గెల్వాలాంబమాత అమ్మవారికి గురువారం 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. కొండారెడ్డిపల్లి గ్రామంలో టపాకాయలు కాల్చి ఆనందాన్ని వ్యక్తంచేసారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్‌గౌడ్, గెల్వయ్యగౌడ్, యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



సీఎం ప్రమాణస్వీకారానికి తరలిన నాయకులు



తాడూరు నుంచి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు



అచ్చంపేటలో స్వీట్లు పంచుతున్న ఉపాధ్యాయులు

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు తెలంగాణ సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో 30 ఏళ్ల తరువాత కాంగ్రెస్ జెండా ఎగిరిందని, ఇక నుంచి నియోజకవర్గంతో పాటు తెలంగాణకు మంచి రోజులు వచ్చాయని అన్నారు. కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

తెలకపల్లి: తెలంగాణ రెండో ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకార కార్యక్రమానికి మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. సీఎంతో పాటు పలువురు నాయకులు ప్రమాణస్వీకారం చేసినందున మండల కేంద్రం తెలకపల్లితో పాటు అన్ని గ్రామాల నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు హైదరాబాద్ తరలివెళ్లారు. వెళ్లిన వారిలో సింగిల్ విండో వైస్‌చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, నాయకులు రామకృష్ణ, నరహరి తదితరులు ఉన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్టలో కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయడంతో పాటు కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో మండలంలోని పలు గ్రామాలతో పాటు మంచాలకట్టలో కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, గోవిందు, రాముడు, కుర్మయ్య, హనుమంతు, నిరంజన్, నర్సింహ, కుర్మయ్య పాల్గొన్నారు.

చారకొండ: ఎనుముల రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల నుంచి మండల నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి సీఎం కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని అన్నారు. ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ నాయకులు పలువురు అన్నారు. తరలి వెళ్లిన వారిలో మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, వెంకట్ గౌడ్, భీముడు, జూపల్లి వెంకటయ్య యాదవ్, సాంబయ్య గౌడ్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంబరాలు

అచ్చంపేట రూరల్: నల్లమల ప్రాంతానికి చెందిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడంపై గురువారం అచ్చంపేటలోని సాయినగర్ జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులు సంబరాలు నిర్వహించారు. కాంప్లెక్స్ సమావేశం ముగిసిన తర్వాత స్వీట్లు పంచి పెట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు బీచ్యానాయక్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, జీహెచ్ఎంలు జీవన్‌కుమార్, అర్జునయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మంచాలకట్టలో..

కూనమనేనిని కలిసిన సీపీఐ శ్రేణులు



కూనమనేని సాంబశివరావుకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న సీపీఐ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో కొత్తగూడెం శాసనసభకు సీపీఐ తరఫున ఎన్నికల బరిలో నిలిచి విజయం సాధించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావును నాగర్‌కర్నూల్ సీపీఐ నాయకులు గురువారం హైదరాబాద్ పార్టీ కార్యాలయంలో కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కూనమనేనికి విప్లవ శుభాకాంక్షలు తెలిపిన వారిలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ, రాష్ట్ర సమితి సభ్యులు కేశవులు గౌడ్, వార్ల వెంకటయ్యతో పాటు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్‌ఎండీ ఫయాజ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జూపల్లికి మంత్రి పదవి రావడంపై సంబరాలు

కొడేరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావుకు మంత్రి పదవి ఇవ్వడంతో కాంగ్రెస్ నాయకులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మండల కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ కరీమ్, జగదీశ్వరావు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రతి ఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. జూపల్లి కృష్ణారావుకు మంత్రి పదవి ఇవ్వడంతో సీఎం రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో చామంతి రాజు, నాగశేషి, రామకృష్ణ, శరత్, రాజు, సురేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావుకు సీఎం రేవంత్ రెడ్డి కేబినెట్‌లో మంత్రి పదవి రావడంతో కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డికు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి సహకరిస్తాం..

అచ్చంపేట రూరల్: రాష్ట్రంలో నూతనంగా కొలువుదీరిన ప్రభుత్వానికి సహకరిస్తామని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిళ్ల సుదర్శన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రేవంత్ రెడ్డికి ఆయన అభినందనలు తెలిపారు. ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రభుత్వానికి సహకరిస్తామని, మేనిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేస్తారని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. త్వరలోనే సీపీఎస్ రద్దు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కంకర వేశారు.. బీటీ మరిచారు



నారాయణపూర్-శ్రీశైలం రోడ్డు ఇలా..



గాన్‌గట్టుతండా- భర్కత్‌పల్లి గ్రామాల రోడ్డు

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాలకు ప్రభుత్వం బీటీ రోడ్లను మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో ఆయా గ్రామాల్లోని రోడ్లకు కంకర వేసి అసంపూర్తిగా వదిలేశారు. మండల పరిధిలోని నారాయణపూర్‌తండా- శ్రీశైలం జాతీయ రహదారికి బీటీరోడ్డు నిర్మిస్తున్నారు. కంకర వేసి నెలలు గడుస్తున్నా.. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా గాన్‌గట్టుతండా – భర్కత్‌పల్లి గ్రామాల్లో బీటీరోడ్డు పనులు అసంపూర్తిగా ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి అసంపూర్తి రోడ్లను పూర్తిచేసి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శిథిలావస్థలో కమ్యూనిటీ భవనం

తాడూరు: మండలంలోని ఆకునెల్లికుదురులో 20 ఏళ్ల కిందట ప్రధానరోడ్డుకు అనుసరించుకుని రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ప్రజాధనం దుర్వినియోగం అయిందని ఏ లక్ష్యంతో కమ్యూనిటీ భవనం నిర్మించారో ఆ లక్ష్యం నెరవేరేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కమ్యూనిటీ భవనం ఇలా..

రోడ్డు మరమ్మతు చేపట్టండి

తాడూరు: మండలంలోని ఎంగంపల్లి నుంచి ఆకునెల్లికుదురు మీదుగా మేడిపూర్ వెళ్లే రోడ్డు అడుగడున గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తుంది. కొంతమేర సీసీ రోడ్డు వేసి మిగతా రోడ్డును అసంపూర్తిగా వదిలేశారు. రోడ్డు పూర్తయితే బస్సు సౌకర్యం కలుగుతుందని అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి రోడ్డు మరమ్మతు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గుంతలు పడిన రోడ్డు ఇలా..

